# నీడలేని పక్షులు

ఫస్టుబెల్ కొట్టారు.

నేను మెల్లగా తెరతొలగించి ఆడిటోరియంలోకి చూశాను.

పట్టుమని పాతికమంది ప్రేక్షకులు కూడా లేరు. గాలి తీసిన బెలూన్ లాగయిపోయాను. నీరసంగా కుర్చీలో కూలబడిపోయాను.

" నీకిదో జబ్బు మోహన్. ప్రేక్షకులు, ప్రేక్షకులు అంటావు. మనం వచ్చింది పరిషత్ పోటీలకు. జనం వుంటేనేం? లేకుంటేనేం? జడ్జీలు వుంటారుగా?" శేఖర్ అన్నాడు.

శేఖర్ పోటీల్లో బహుమతుల కోసమే నాటకాలాడుతున్నట్లు భావిస్తాడు.

కాని నేను నాటకాలాడేది ప్రజలకోసం

ఈ పోటీలు, జడ్జీలు వివిధ ప్రాంతాల్లో గల ప్రేక్షకుల వద్దకు మా నాటకాలు చేరడానికి ఉపకరణాలు మాత్రమే.

నేను రచించి, దర్శకత్వం వహించి, ప్రధాన పాత్ర ధరిస్తున్న 'సంధ్యారాగం' ఆంధ్రదేశంలో ఈ వరకే సంచలనాన్ని సృష్టించింది. ఎన్నో బహుమతుల్ని పొందింది. బొంబాయిలో ఇన్‌విటేషన్ పరిషత్ పోటీలు నిర్వహిస్తూ మమ్మల్ని కూడా ఆహ్వానించారు.

ఇప్పుడు పరిషత్ పోటీలు గ్రామాలకు విస్తరించాయి. గ్రామాల్లో జనం రాత్రంతా కూర్చుని సాంఘిక నాటకాలని చూస్తున్నారు. కానీ పట్టణాలల్లో సుకుమారులు టీవీలకు అంటిపెట్టుకుని కూర్చుంటున్నారు. గ్రామాల్లో జనం రెస్పాన్స్, అదొక గొప్ప థ్రిల్! పట్టణాల్లో దొరకదు.

పొద్దుటే ఆ మహానగరానికి వచ్చాం. ఆ రోజు ప్రథమ ప్రదర్శన మాదే. కాలనియమాన్ని ఖచ్చితంగా పాటిస్తామని నిర్వాహకులు ముందే చెప్పారు. థర్డ్‌బెల్ మోగగానే కర్టెన్ తొలుగుతుంది.

మేం తయారుగా వున్నాం.

రెండో బెల్ మోగింది.

మళ్ళీ కర్టెన్ తొలగించి ఆశగా ఆడిటోరియంలోకి చూశాను.

నాకళ్ళను నేనే నమ్మలేకపోయాను.అంత పెద్ద ఆడిటోరియం ముప్పాతికభాగం నిండిపోయివుంది.

ప్రేక్షకుల్లో పురుషులతోపాటు సమానసంఖ్యలో స్త్రీలూ వున్నారు. అసలు జంటల సంఖ్య ఎక్కువగా వుంది. ముసలి జంటల నుంచి మొన్ననే పెళ్ళయిన జంటలవరకూ కన్పిస్తున్నారు.

నాకు ఆ ప్రేక్షకులను చూడగానే హుషారు వచ్చింది. ఉత్సాహంగా ఈల వేశాను.

" ఇవాళ ఇక గురువుగారు దున్నేస్తారు. బహుమతులన్నీ మనవే"

అనుకొన్నట్లే నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించాం. అయితే ప్రదర్శన జరుగుతున్నప్పుడు ఆయా సన్నివేశాలలో ప్రేక్షకుల రెస్పాన్స్ మాత్రం అంత సంతృప్తికరంగా లేదు. బాగా పండిన సీనుల్లో కూడా ప్రేక్షకులు సైలంట్‌గా వుండిపోయారు.

ఆ లోపం ఎవరిది? మాదా? ప్రేక్షకులదా?

మాకు ఉత్తమ ప్రదర్శనతోసహా అనేక బహుమతులు వచ్చాయి.

"అంతా బాగుంది. కానీ మీ మహానగర ప్రేక్షకులకు గుండెల్లేవా? లేక చప్పట్లు కొట్టడానికి క్కూడా బద్ధకమా? ఇంత సీరియస్ అండ్ సైలెంట్ ఆడిటోరియంలో నాటకాన్ని ప్రదర్శిస్తే థ్రిల్ వుండదు."

"మీ నాటకానికే కాదు. మా ప్రేక్షకులు ఏ నాటకాన్నయినా సరే సైలెంట్‌గా ఎంజాయ్ చేస్తారు. ఐమీన్ సైలెంట్ స్పెక్టేటర్స్‌గా వుంటారు.

"ఎంచేతనంటారు?"

"అది మీరు తెల్సుకోవాల్సిన విషయం. మేం చెప్పకూడదు."

✡ ✡ ✡

మరుసటి రోజు రాత్రి పదకొండు గంటలకు మా తిరుగుప్రయాణం. రిజర్వేషన్ అయిపోయిందెప్పుడో.

పగలంతా సిటీని చూసే కార్యక్రమాన్ని పెట్టుకున్నాం.

నాన్న ఇప్పుడు గుర్తుకొచ్చాడు నాకు.

" ఒరేయ్, నాటకాలలో పైకొస్తున్నావు. ఉద్యోగం సంపాదించలేకపోయినా కీర్తిని పుష్కలంగా సంపాదిస్తున్నావు. అది నాకూ సంతోషమే. కానీ నువ్వు ఈ ఇంటికి నా తర్వాత వారసుడివి. నీ ఇంటిని, నీ కుటుంబసభ్యుల్ని, నీ వాళ్ళను పట్టించుకోకుండా వదిలేస్తే ఎలా? వాళ్ళ తర్వాతే ఏ కళాసేవైనా!"

"నేను కళాసేవ చేస్తున్నానని ఎప్పుడు చెప్పాను నాన్నా? అలా చెప్తే హిపోక్రసి. నేను నా పిచ్చికొద్దీ, ప్రేక్షకుల చప్పట్లు కోసం, పొగడ్తల కోసం, పత్రికలు రాసే రివ్యూల కోసం, సినిమాల్లో అవకాశం కోసం నాటకాలు వేస్తున్నాను. నేను ఈ కుటుంబం కోసం ఏం చేయాలో చెప్పండి. మీరు ఏదన్నా చెప్తే చేయనన్నానా?"

"అయితే విను. మొన్న నువ్వేదో పరిషత్తుకు వెళ్ళినపుడు లావణ్యను చూడడానికి నువ్వు వెళ్తున్న నగరం నుంచి ఒక సంబంధం వచ్చింది. వారికి పిల్లనచ్చిందని రాశారు. మిగతా విషయాలు మాట్లాడుకోవడానికి వాళ్ళే ఇక్కడికొస్తానని కూడా రాశారు. నేను బొంబాయి వస్తానంటే వద్దని కూడా అన్నారు. కానీ ఇంతవరకు రాలేదు. ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబు లేదు. నువ్వు ఎలాగూ ఆ నగరానికి వెళ్తున్నావు కనుక ఎలాగో తీరిక చేసుకుని వాళ్ళని కలవాలి. ఎప్పుడొస్తారో ఒక డేట్‌ని నిర్ణయించుకుని రావాలి. వీలైతే వాళ్ళను నీ వెంట

తీసుకునిరా" అంటూ వారి వివరాలు ఇచ్చాడు. బయల్దేరబోతుండగా "లావణ్య విషయం మర్చిపోకు, మర్చిపోకేం" అంటూ పదిసార్లు హెచ్చరించాడు.

మేము అంతలేని వాళ్ళమేం కాము. లావణ్యకు పెళ్ళిచేయటం పెద్ద కష్టం కూడా కాదు. దానికి వయసుకూడా మించిపోలేదు. అయినా ఆడపిల్ల పెళ్ళికోసం నాన్న ఎందుకింత కంగారు పడ్తాడో నాకు అర్థం కాదు.

"అలాగే మర్చిపోను... మర్చిపోను... మర్చిపోను" అంటూ ముమ్మారు చెప్పాను.

కానీ ఇంతవరకూ నాకావిషయమే గుర్తులేదు.

హడావుడిగా, నాన్న ఇచ్చిన వారి వివరాలను సూట్‌కేస్ అడుగునుండీ తీశాను. వారుండే లొకాలిటీ వివరాలు తెల్సుకొన్నాను.

ఆ లొకాలిటీ, ఊరికి మరొకవైపున వుంది. బిజీ లొకాలిటీ.

అక్కడికి వెళ్ళడానికి మార్గం కూడా ఎంక్వయిరీ చేసి తెల్సుకొన్నాను.

"మమ్మల్ని వదిలేసి నువ్వు ఎక్కడికన్నా వెళ్తావా ఏమిటి? అలాగయితే ఊరు చూడటం కాన్సిల్, ముందే చెప్తున్నా" శేఖర్ నా ధోరణి చూసి హెచ్చరించాడు.

"నోనో... మనం ముందుగా నిర్ణయించుకున్న ప్రోగ్రాం ఏదీ కాన్సిల్ కాదు. మిమ్మల్ని వదిలేసి నేను ఎక్కడికీ వెళ్ళటం అన్న ప్రశ్నలేదు. ఎందుకంటే అది మన నాటక సౌభ్రాతృత్వ సిద్ధాంతానికే వ్యతిరేకం. కాకపోతే మన ప్రోగ్రాం అంతా అయ్యాక టైం వుంటే నేను ఒకచోటుకి వెళ్ళి వస్తాను. మా చెల్లెలు పెళ్ళి విషయంలో... ఓకే?"

"ఓకే..'

✡ ✡ ✡

"డార్లింగ్ ఎలాగుంది? ఎక్సైటింగ్‌గా లేదూ?"

"ఇటీజ్ స్వీట్ అండ్ ఎక్సైటింగ్... బట్ ..."

"బట్! వ్హాట్?"

"ఈపార్కులో... ఇక్కడ ఇంతమంది చుట్టూ వుండగా...." ఆమె సిగ్గుపడ్తూ మెల్లగా అంది.

"నోనో. నేను ముందే చెప్పేనుగా? ఇది పార్కుకాదు. ఇక్కడ జనం ఎవ్వరూ లేరు. ఉన్నా మనవైపు చూడరు. అలా అనుకోవాలి. దిస్ ఈజ్ అవర్ బెడ్‌రూమ్. మనం ఈ రూమ్‌లో ఒంటరిగా వున్నాం అని అనుకోవాలి.'"

"ఛీ... నా వల్ల కాదబ్బా"

"అవుతుందబ్బా! కొత్తకదా? మరో నాలుగురోజులు పోనియ్!"

ఇక ఉత్కంఠను ఆపుకోలేక అటు చూశాను.

అతని కౌగిట్లో నలిగిపోతున్న ఆ అమ్మాయి అప్పుడే నావైపు చూసింది.

ఒక్కసారి బిగ్గరగా అరుస్తూ అతని కౌగిట్లో నుండి బయటపడింది.

"వాట్ హేపెండ్ మైడియర్!"

"అటు చూడు. అతను మనల్నే చూస్తున్నాడు"

ఆమె నావైపు వేలు చూపించింది.

అతనొక్కసారిగా కోపంగా లేచాడు.

"ఏయ్ మిష్టర్, నీకు మేనర్స్ తెలియదా? సినిమాల్లో కూడా ఎప్పుడూ ఇటువంటి దృశ్యాలు చూడలేదా? యూ బ్రూట్. గెట్ ఎవే అండ్ మైండ్ యువర్ వోన్ బిజినెస్..."

అతను నన్ను తన్నినంత పనిచేశాడు.

మేము మెల్లగా అక్కడినుండి బయటపడ్డాం.

గేట్‌వే ఆఫ్ ఇండియా దగ్గర ప్రారంభించిన మా పర్యటన కార్యక్రమం సగానికి పైగా అయిపోయింది.

ఆరోజు ఆదివారం. ఎక్కడికెళ్ళినా జనం గుంపులు గుంపులుగా వున్నారు.

ఆ జనంలో... అన్నీ జంటలే! ఎక్కడ చూసినా జంటలే.

బౌద్ధాలయంలో, హాజీఆలీ గోరీ దగ్గర, అక్బర్ ఆర్ట్ గేలరీలో, అక్వేరియంలో, చర్చ్ గేట్ దగ్గర చివరికి ఇక్కడ విక్టోరియా గార్డెన్‌లో.

ఎక్కడ చూసినా జంటలు.

కొందరు కబుర్లు చెప్పుకొంటున్నారు. కొందరు తింటున్నారు.

చాలామంది ఇలా...బెడ్‌రూమ్ కబుర్లు చెప్పుకుంటున్నారు.

శృంగార ఘట్టాలను రియల్‌గా అభినయిస్తున్నారు.

"అంతమదం పట్టివుంటే ఇళ్ళల్లో తలుపులు మూసుకుని అఘోరించకూడదూ? పబ్లిక్ ప్లేసెస్ దొరికాయా ప్రతాపాలు చూపుకోటానికి?"

మా కిరాయి నటీమణి ఆరంభంలోనే చిరాకుపడింది.

ఇప్పుడు మా వాళ్ళందరిలో చిరాకు పెరిగిపోయిందని నేను గ్రహించాను.

"గురువుగారూ... మీరు గనుక ఊరుకొన్నారు. నేనైతే వాడిని ఉతికేసివుండేవాడిని. తప్పుడు పనివాడు చేస్తూ చూశామని మనని తిడ్తాడేం?"

"గురువుగారు స్టేజిమీద పులి. కాని ఇలాంటి విషయాల్లో పిల్లికన్నా అధ్వాన్నంగా కన్పిస్తున్నారు." మా కిరాయినటి సున్నితంగా పొడిచింది నన్ను.

"ఇది ఈ పట్టణ నాగరికతేమో?"

"నా పిండాకూడు నాగరికత. ఇదేం నాగరికత? ఇంక ఈ సిటీని చూసినంతవరకు చాలు బాబూ... వీలైతే ఒకటి రెండు స్టూడియోలు చూద్దాం"

అంతా నటీమణి ప్రపోజల్‌ను సపోర్ట్ చేశారు. చాలంటే చాలన్నారు.

నగరంలో స్టూడియోలు చూడాలన్నారు.

"ఆల్‌రైట్... యాజ్ యువిష్. బట్ నాదో చిన్నకోరిక?"

"ఏమిటి?"

"ఆడిటోరియంలో జంటలు చాలా వున్నాయి. కానీ జనం నుండి పెద్దగా మనకు రెస్పాన్స్ లేదు. ఇటు సిటీలో కూడా ఎక్కడ చూసినా జంటలే. శృంగార సన్నివేశాలే.ఇదంతా భ్రష్ట నాగరికత కావచ్చు. కానీ దేనికైనా కారణం వుండాలిగా. వారంతా అలా పబ్లిక్ ప్లేసెస్‌లో ఎందుకిలా ప్రవరిస్తున్నారో తెల్సుకోవాలి. అది నా కోరిక. కనుక మనమంతా కల్సి మరో ప్లేస్‌ను విజిట్ చేయాలి. ఆ తర్వాత మీరు స్టూడియోల వెళ్తారు. నేను మా చెల్లెలు పెళ్ళి విషయంలో వెళ్ళాల్సిన చోటికెళ్తాను. మళ్ళీ మనం కల్సుకునేది ట్రయిన్‌లోనే. ఓకే..."

"ఓకే..." అంతా అరిచారు.

"గురువుగారూ, అదేదో గుడిలా వుంది. చూసిన తప్పులకు పరిహారంగా వుంటుంది. ఆ గుడిని చూసొద్దాం పదండి."

"అంటే గుళ్ళో కూడా జంటలు రొమాన్స్ ప్రదర్శిస్తారని నీ ఉద్దేశ్యమా?"

"ఆహా! అక్షరాలా! అవునో కాదో తేల్చుకోటానికైనా గుళ్ళోకి వెళ్ళాల్సిందే"

పాతకాలంనాటి పెద్ద గుడి. విశాలంగా ప్రశాంతంగా వుంది.

స్వామి దర్శనం చేసుకుని సర్వే ఆరంభించాం.

గుడికి వెనుక భాగాన పూజా పుష్పాలకోసం తోట పెంచారు.

పార్కుల్లోలా పనికిరాని మొక్కలు అక్కడ లేవు. తులసి, మందార, పున్నాగ, పారిజాతం, మల్లె, మొల్ల,... మొక్కలతో ఆ తోట అందంగా ఆరోగ్యంగా వుంది.

మధ్య మధ్య మామిడి చెట్లు, వేపచెట్లు, రావిచెట్లు, కొబ్బరిచెట్లు, మారేడువృక్షం, సైంటిఫిక్‌గా పవిత్రంగా వుంది.

అక్కడా జంటలు వున్నారు. కానీ గుంపులు గుంపులుగా కాదు.

పరిమితంగా మాత్రమే.

వాళ్ళలో ఒక ముసలిజంట నా దృష్టిని ఆకర్షించింది.

ఆ జంటను నేను ఆడిటోరియంలో చూశాను.

ముసలాయన ముసలామె చేతులు పట్టుకుని మెల్లగా నిమురుతున్నాడు. భర్త స్పర్శాసుఖాన్ని అనుభవిస్తూ ముసలామె సిగ్గుతో వంకరలు తిరిగిపోతోంది.

"ఎంతసేపు కూర్చుంటావ్ పార్వతీ? నీ కసలే నడుంనొప్పి కదా? ఇలా నా ఒళ్ళో కాసేపు పడుకోరాదూ?"

"మహా! మీకు నడుంనొప్పులు లేనట్లు? నాకు నడుంనొప్పులు ఒక్కటే. మీకు కాళ్ళునొప్పులు, కీళ్ళునొప్పులు, కూడా వున్నాయి కదా? మీరే నా ఒళ్ళో పడుకోండి." అంటూ ఆమె ముసలాయన చెయ్యిని లాగింది.

ముసలాయన ఆమె ఒళ్ళో తలపెట్టుకుని పడుకున్నాడు.

ఆమె హేండ్‌బాగ్‌లోనుంచి జంతికలు తీసి అతని నోటికందించింది. అతను సగం ముక్కను కొరికేడు. మిగతా సగాన్ని ఆమె నోట్లో వేసుకొంది.

అదయ్యాక మరోముక్క అందించిందతని నోటికి.

"ఊహూ... ఈసారి నువ్వు ముందు, నేను తర్వాత"

అలా లోకాన్ని మర్చి వారిద్దరూ ఆ జంతిక ముక్కల్తో అటలాడుకొంటూ వున్నారు.

"గురూగారూ. ఇక మేం ముసలి శృంగారాన్ని చూసి భరించలేం.మీరేదో తేల్చుకొంటామన్నారు కదా? మంచి ఛాన్సు కానీయండి"

నన్ను చూడగానే ముసలాయన ముసలామె ఒళ్ళోనుంచి లేచాడు.

"ఓ బెస్ట్ ఏక్టర్ అండ్ డైరెక్టర్! కమాన్ కమాన్. రండి కూర్చోండి, గుర్తుపట్టావాపార్వతీ ఈయన్ని?"

"ఆహా! మీకన్నా ముందే గుర్తుపట్టాను. ఈ జంతికలు తీసుకోండి మహానటుడుగారూ"

నేను వాళ్ళ పొగడ్తలకు కాస్త మెత్తబడిపోయాను. కానీ అంతలోనే మా వాళ్ళంతా నన్ను చూస్తున్నారని గుర్తుకొచ్చింది.

"యుఆర్ రియల్లీ ఎగ్రేట్ ఏక్టర్ మిస్టర్. ముఖ్యంగా శృంగార ఘట్టాల్లో మీ నటన సూపర్బ్"

"కానీ సర్... నేను స్టేజి మీద మాత్రమే శృంగార ఘట్టాలను ఏక్ట్ చేయగలను. మీలాగా పవిత్రమైన ఆలయంలో, పబ్లిక్‌గా ఏక్ట్ చేయలేను. ఇన్నేళ్ళొచ్చి... మీరిలా చేయటం ఏమన్నా బావుందా? మాలాంటి యువకులకు బుద్ధి చెప్పాల్సిన మీరే ఇలా బరితెగిస్తే మీ పిల్లల మీద ఈ ప్రభావం ఎంత దారుణంగా వుంటుందో వూహించగలరా?"

ఘాటుగానే ఎటాక్ చేశాను.

అయినా ఆయన కోపగించుకోలేదు. సిగ్గుపడలేదు. పైగా గలగలా నవ్వేడు.

"ఓస్! ఇంతేనా? అందుకే ఇంత ఆవేశం ఎందుకయ్యా? కూల్‌డౌన్...ప్లీజ్ కూల్ డౌన్"

ఆ మాట అన్నాక నాకు మరింత ఆవేశం వచ్చింది.

"అసలు విషయం చెప్తాను. ఆవేశపడకు. ఇది మీకు ఆలయం మాత్రమే. కానీ మాకిది ఆశ్రయమిచ్చిన ఓ పవిత్రస్థలం కూడా"

"అంటే...?

"ఆలయం... అదిగో... అది నాయనా! ఇది తోట. ఈ తోటలోని చెట్లపైకి ఒక్కసారి చూడు. ఎన్ని పక్షులకు ఆ చెట్లు ఆశ్రయం ఇస్తున్నాయో! మేము నీడలేని పక్షులం. అందుకే ఆ చెట్ల మీద పక్షులు స్వేచ్ఛగా గూళ్ళు కట్టుకుంటే, మేము మాకున్న కాస్త పలుకుబడిని ఉపయోగించుకుని ఈ చెట్ల కింద ఆశ్రయం సంపాదించుకున్నాం."

"అయితే మీకు ఇళ్ళులేవా? నేను నమ్మను"

"ఇళ్ళు వున్నాయి బాబూ. నాకే కాదు. ఈ నగరంలో మీకు కనిపించిన జంటలందరికీ ఇల్లంటూ వుంది. చూడ్డానికి మా భవనాలు చాలా ఎత్తుగా వుంటాయి. కానీ అంత ఎత్తైన

భవనంలో మాది అగ్గిపెట్టెలాంటి ఓ చిన్న ఫ్లేట్ మాత్రమే!"

"అయితే? ప్రపంచంలో చిన్న గుడిసెల్లో ఎంతమంది నివసించటం లేదు?"

"నిజం నాయనా... వుంటున్నారు. కానీ మేము మధ్యతరగతి మనుష్యులం. మాకు హోదాలకుమించి కోరికలున్నాయి. ఆ కోరికల్ని పూర్తిగా తీర్చుకునే ఆర్థికశక్తి మాకు లేదు. అందుకే అడ్జెస్ట్‌మెంట్ మెంటాలిటీతో బతుకుతున్నాం"

"వివరించి చెప్పండి. నాకేం అర్థం కావడం లేదు."

"చెప్తాను నాయనా". నాకు నలుగురు కొడుకులు. ముగ్గురికి పెళ్ళిళ్ళయ్యాయి. నలుగురూ ఇక్కడే ఇంజనీర్లుగా ఉద్యోగాలు చేస్తున్నారు. ఇప్పుడు నా పెద్దకొడుకు, వాడి భార్య ఏ సినిమాహాల్లోనో వుంటారు. నా మూడో కొడుకు ఏ హోటల్‌రూమ్‌లోనో భార్యతో వుంటాడు. నాలుగోవాడు, వాడికింకా పెళ్ళి కాలేదు కదా. కంపెనీలోనే ఆ పనీ ఈ పనీ చేస్తూ కాలక్షేపం చేస్తూంటాడు."

"ఎందుకు?"

"ఎందుకంటే ఈ ఆదివారం ఇంట్లో వుండే వంతు నారెండో కొడుకుది. వచ్చేవారం నా మూడో కొడుకుది. ఆ వచ్చేవారం మొదటి కొడుకుది. పెళ్ళయితే నా నాలుగో కొడుకు కూడా వంతుకొస్తాడు. అందుకే వాడు పెళ్ళి చేసుకోనని మొరాయిస్తున్నాడు".

"మరి- మీరు? మీకు వంతురాదా?"

"కావాలని అడిగితే వస్తుంది. కానీ ముసలాళ్లం. మేం ఎక్కడ కాలక్షేపం చేసినా చెల్లుతుంది కదా? అంచేత సిటీలో ఎక్కడ ఎలాంటి ఫంక్షన్ జరిగినా వెళ్తుంటాం. ఎక్కడా ఏమీ లేకపోతే ఈ చెట్టే మా పాలిట కల్పవృక్షం"

"ఇలా దేశ సంచారం... నో... నో... నగర సంచారం చేస్తూ.. మీరు ఇబ్బందిపడి జనాన్ని ఇబ్బంది పెట్టేకన్నా తలా ఓ ఫ్లేట్‌లో వుండవచ్చుకదా?"

"ఉండలేము నాయనా... ఎందుకంటే ఇది మహానగరం. మేము మధ్యతరగతి మనుష్యులం. ఇక్కడి ధరలు, మా కోరికలు, ఈ భవనాలంత ఎత్తుగా వుంటాయి. ఉండేది ఒక్క గదిలోనే అయినా, అది ఎయిర్‌కండిషన్డ్ అయుండాలి. బాత్‌రూమ్, కిచెన్‌లు చాలా కాస్ట్లీగా వుండాలి. సోఫాలు, టీవీ, ఫ్రిజ్ లాంటివి సామాన్యమైన వస్తువులు, మాకు, కాదు-ప్రతిజంటకూ వుండితీరాలి. ఇక పిల్లలకి కాస్ట్లీ చదువులు, బాంక్ బ్యాలెన్సులు... వుండకపోతే ప్రాణం గిలగిల కొట్టుకుపోతుంది కదా? ఇంజనీర్ ఉద్యోగంలో ఇవన్నీ కలిగివుండటం ఇంపాజిబుల్. అందుకే మేమంతా సమిష్టిగా జీవించక తప్పదు. ఒకరిపై ఒకరికి ప్రేమ ఉండి కాదు. అడ్జెస్ట్‌మెంట్. దట్సాల్. జాయింట్‌ఫామిలీ వ్యవస్థ మరో కొత్త రూపంతో ప్రాణం పోసుకుంటోంది నాయనా ఈ మహానగరాల్లో"

"కానీ బజారుజీవనం మీకు అసహ్యంగాలేదూ? సిగ్గువేయటంలేదూ?"

"ముష్టివాళ్లు తమతమ స్థావరాలను రోడ్డుపక్కన ఏర్పరచుకొంటారుకదా? వాళ్లను చూసి అసహ్యించుకొంటున్నారా ఎవరైనా? అక్కడే వాళ్లు పిల్లల్ని కంటున్నారు. పెంచి పెద్ద చేస్తున్నారు. మధ్యతరగతి మనుష్యులం మేంకూడా మా స్థాయికి తగ్గట్లు స్థావరాలు ఏర్పరుచుకున్నాం. ఇందులో సిగ్గుపడటానికేముంది? నీకంటే ఇది కొత్తగా వుంది కానీ, ఇక్కడివారెవరూ వీటిని పట్టించుకోరు నాయనా. అంత టైం ఎవరికి? మాక్కూడా సిగ్గువెయ్యదు. దిస్ యీజ్ పార్ట్ ఆఫ్ అవర్ సిటీకల్చర్..."

నాకు మతిపోయింది. అసహ్యమేసింది. ప్రశ్నలన్నిటికీ జవాబులు లభించాయి. ఆయన్నింకా ప్రశ్నలు వేసి బాధపెట్టాలనిపించలేదు.

టైమ్ చూసుకున్నాను. ఇంకా మావాళ్లు బోలివుడ్ సినిమా స్టూడియోలు చూడాలి. నేను పెళ్ళి సంబంధంవారిని పట్టుకోవాలి.

"ఓకే సర్... లీవ్ ది అన్‌ప్లెజెంట్ టాపిక్. ఈ చిరునామాకు ఎలా పోవాలో మీకు తెలిస్తే చెప్పగలరా?"

నేనిచ్చిన కాగితాన్ని చూశాడాయన.

"యస్. సర్వేశ్వరరావు. నాకు మిత్రుడే. అతనితో మీకేంపని?"

"మాకు తెల్సినవారి అమ్మాయిని వారి అబ్బాయికోసం చూసొచ్చారట. అబ్బాయి నచ్చిందన్నారుట. కానీ ఇంతవరకు మళ్ళీ ఎలాంటి వర్తమానం లేదుట. ఆ అమ్మాయి నాన్నగారు నన్ను వాళ్ళను కల్సి వాకబు చేసిరమ్మన్నారు."

"ఓ! ఆ విషయమా? నిన్న నాటకానికి అతను వచ్చాడు. అప్పుడే ఈ విషయం చెప్పాడు. వాళ్ళబ్బాయికి పిల్ల నచ్చిందట. కానీ ఇప్పుడప్పుడే పెళ్ళి చేసుకోనని మొరాయిస్తున్నాడుట. ఎందుకంటే! చెప్పేను కదా? వాళ్ళదీ మా ప్రాబ్లమే! వంతులు వారీగా నగర సంకీర్తన చేయటం వాడికిష్టం లేదు"

"ఓ! ఐసీ! అయితే మీ ఫ్రెండ్ కూడా మీలాగే ఫ్లేట్‌లో వుంటాడా?"

"యస్... అతడికి నాకులాగే నల్గురు కొడుకులు. ఇప్పుడు, ఈ క్షణంలో అతను కూడా నాలాగే ఎక్కడో ఏ చెట్టుకిందో వుంటాడు. మీరు కష్టపడి వారింటిని వెతుక్కుంటూ వెళ్లక్కర్లేదు. నేను నా ఫ్రెండ్‌కి చెప్పి ఉత్తరం రాయిస్తాను. కొడుకుని అంగీకరింపచేయటానికి అతను సర్వశక్తులా ప్రయత్నం చేస్తున్నానని నాకు చెప్పాడు. ఆ ప్రయత్నంలో అతను తప్పకుండా సక్సెస్ అవుతాడు. ఈ పెళ్ళి జరుగుతుంది. కాకపోతే కాస్త వెనకాముందూ. అంతే. అలాగని ఆ పెళ్లికూతురు తండ్రితో చెప్పండి. నామాటే వారిమాట"

"అయితే మీ ఫ్రెండ్‌తో కొడుకును ఒప్పింపచేసే ప్రయత్నం చేయవద్దని చెప్పండి'

"అదేం? ఇంతలోనే మనసు మార్చేసుకున్నావేం నాయనా? అయినా మధ్యలో నీకు..."

"అదంతే! మీరు చెప్పిన భ్రష్టకల్చర్‌లోకి నా చెల్లెల్ని నేను చచ్చినా వెళ్లనివ్వను. వారి సంబంధాన్ని మేం కాన్సిల్ చేసుకొన్నాం అని చెప్పండి"

"అంటే- ఆ అమ్మాయి నీ చెల్లెలా? ప్లీజ్... తొందరపడి నిర్ణయానికి రావద్దు. ఆ అబ్బాయి చాలా మంచివాడు. వారి ఫామిలీ చాలా మంచిది. వారందరికీ మీ సంబంధం బాగా నచ్చింది. చాలా చిన్న విషయంపైన చాలాపెద్ద నిర్ణయం తీసుకొని కాబోయే వివాహాన్ని చెడగొట్టవద్దు. మీ నాన్నగారితో అన్ని విషయాలు చెప్పు. అయన కూడా కాదంటే..."

"ఆయన కాదన్నా అవునన్నా ఈ పెళ్ళిని నేను మాత్రం జరగనివ్వనండీ. నా చెల్లెలు సహజ వాతావరణంలో ఆరోగ్యంగా పెరిగింది. స్త్రీ బయటికెళ్లినప్పుడు ఎలాంటి స్వేచ్ఛను అనుభవించాలో, ఇంట్లో వున్నప్పుడు ఎలాంటి స్వేచ్ఛననుభవించాలో నాలుగుగోడల మధ్య భర్తతో ఏకాంతంలో వున్నప్పుడు ఎలాంటి స్వేచ్ఛననుభవించాలో తెల్సిన పిల్ల. దానిని మీ కల్చర్‌కి బందీని చెయ్యలేను."

"మరొక్కసారి బాగా ఆలోచించు నాయనా!"

ఆయన నా చేతులు పట్టుకొని ప్రాధేయపడ్డాడు.

"అయినా మీకెందుకండీ ఇంతబాధ? నేను చెప్పమన్న విషయాన్ని మీ స్నేహితుడితో చెప్పండి. అంతేకదా?"

"కానీ... కానీ... ఆ స్నేహితుడిని నేనే నాయనా"

"అంటే..."

"నువ్వు వెతుకుతున్న సర్వేశ్వరరావుని నేనే"!

విపుల మాసపత్రిక, నవంబర్ 1993)